దమ్ముంటే బిజెపి మిత్రులను దూరం చేయాలి

చంద్రబాబుకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు సూచన

నోట్ల రద్దు తరువాత ఉగ్రవాదం రెండురెట్లు పెరిగింది

మోడీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

మతతత్వంపై కాంగ్రెస్ సున్నిత ధోరణి

వైసిపి కూడా మతోన్మాదాన్ని అడ్డుకోవడం లేదు

దేశంలో బిజెపిని మరోసారి అధికారంలోకి రానివ్వడమంటే దేశాన్ని ఫణంగా పెట్టడమేనని, చంద్రబాబుకు నిజంగా బిజెపిని ఓడించాలని ఉంటే ఎన్‌డిఏలో ఉన్న ఆ పార్టీ మిత్రులను దూరం చేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన సిపిఎం ప్రాంతీయ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. నితీష్‌కుమార్, రాజ్‌థాకరే, రాంవిలాస్ పాశ్వాన్ లాంటి అనేక మంది ఇంకా బిజెపితోనే ఉన్నారని, అటువంటి వారిని బిజెపికి దూరం చేసే పనిచేస్తే ఉపయోగం ఉంటుందని చంద్రబాబుకు సూచించారు. దేశస్థాయిలో కూటముల వల్ల పెద్దగా ఉపయోగం ఉండదని, రాష్ట్రాల వారీగా ఎక్కడికక్కడ బిజెపిని నిలువరించే ప్రయత్నం చేయడం ద్వారానే కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకుండా చేయగలుగుతామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కలుస్తున్న వారందరూ ఇప్పటి వరకూ బిజెపికి వ్యతిరేకరంగా ఉన్నవారేనని అన్నారు. ఇప్పుడు చేస్తున్న కూటములవల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని అన్నారు. గతంలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్‌ల సమయంలోనే చంద్రబాబు ప్లేటు ఫిరాయించాడని, అవసరానికి తగట్టు ఆయన మారిపోతుంటాడని అన్నారు. 2014లో కేంద్రంలో కాంగ్రెస్ చేస్తున్న అవినీతిపై ప్రచారం చేసుకుని అధికారంలోకొచ్చిన బిజెపి ఇప్పుడు అదే పెద్ద అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. 2019 ఎన్నికల్లో చెప్పుకునేందుకు ఏమీ లేకపోవడంతో మతోన్మాదాన్ని, రామమందిర నిర్మాణాన్ని ముందుకు తీసుకొస్తోందని తెలిపారు. గత నాలుగేళ్లలో దేశంలో ఉన్న ఐక్యతను, సంస్కృతిని, సామాజిక న్యాయాన్ని పథకం ప్రకారం దెబ్బతిస్తోందని అన్నారు. విగ్రహాలతో ఐక్యత నిలబడదని, ప్రజాఐక్యతతోనే దేశంలో లౌకికతత్వం నిలబడుతుందని తెలిపారు. నోట్ల రద్దు విఫలం అవడంతో రెండేళ్ల తరువాత తేలుకుట్టిన దొంగల్లా ఉన్నారన్నారు. నోట్ల రద్దు సరైంది కాదని, నల్లధనాన్ని తెల్లధనంగా మారుస్తుందని, ఉగ్రవాదాన్ని పెంచుతుందని, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందని సిపిఎం ఆ రోజే చెప్పిందని, ఇప్పుడు అదే నిజమైందని తెలిపారు. ఆరు నుండి ఏడు లక్షల కోట్లు నల్లడబ్బు పనికిరాకుండా పోతుందని బిజెపి నాయకులు చెప్పారని, అది కూడా బ్యాంకుల్లోకి వచ్చి చేరిందని తెలిపారు. నల్లడబ్బు తెల్లడబ్బుగా మార్చి అక్రమార్కులకు ఉపయోగపడిందని అన్నారు. ఉగ్రవాదం గతంలో పోల్చుకుంటే రెండు రెట్లు పెరిగిందని, దేశ ఆర్థికస్థితి మాంద్యంలోకి వెళ్లిందని అన్నారు. నోట్ల రద్దుతో చంద్రబాబుకు భాగం ఉందని, రద్దు సమయంలో బిజెపి తీరును సమర్థించిన చంద్రబాబు ఇప్పుడు వ్యతిరేకిస్తున్నట్లు ఫోజు పెడుతున్నారని విమర్శించారు. నోట్ల రద్దు నష్టమని ఆర్‌బిఐ మినిట్స్‌లోనే ఉందనే విషయం ఇప్పుడు బయటకు వచ్చిందని, దీనిపై మోడీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. జిఎస్‌టి పునాదిలోనే ప్రమాదకరమైన అంశాలున్నాయని, రూపాయి పతనమైందని చెప్పారు. దేశంలో ఆర్థిక పరిస్థితి పతనమై ప్రజలు ఇబ్బందులు పడుతుంటే బిజెపి మత విద్వేషాలపై దృష్టిపెట్టి ప్రజలను రెచ్చగొడుతోందని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పులను లెక్కచేయడం లేదని అన్నారు. శబరిమల విషయంలోనూ, రామమందిరం విషయంలోనూ బిజెపి తీరు ప్రమాదకరంగా ఉందని అన్నారు. చట్ట వ్యవస్థలను ఏ మాత్రమూ లెక్కచేయడం లేదని తెలిపారు. శబరిమల విషయంలో కోర్టులిచ్చిన తీర్పులను అప్పుడు, ఇప్పుడూ సిపిఎం పాటించిందని తెలిపారు. ఈ విషయంలో కాంగ్రెస్ సున్నితధోరణి అనుసరిస్తోందని, ఇది మతోన్మాదానికి ఊతమిచ్చే విధంగా మారుతోందని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో అధికారంలో ఉన్న బిజెపి అక్కడ అనేక నగరాలపేర్లను మార్చేస్తోందని, దీనిద్వారా ప్రజల్లో సెంటిమెంటును రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయోధ్య విషయాన్ని ఎన్నికల సమయంలోనే ముందుకు తీసుకొస్తోందని చెప్పారు. ప్రస్తుతం దేశంలో లౌకికవాదాన్ని కాపాడాలంటే బిజెపికి వ్యతిరేకంగా పోరాడటమే మార్గమని అన్నారు. ఈ విషయంలో సిపిఎం ముందుందని, జాతీయోద్యమ సంప్రదాయాన్ని కొనసాగిస్తోందని అన్నారు. బిజెపిని దోషిగా నిలబెట్టాలంటే దేశంలో సిపిఎం, వామపక్షాల వల్లే సాధ్యమవుతుందని, మరోపార్టీలు ఈ బాధ్యతను నిర్వహించలేవని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకూ టిడిపి, వైసిపి రెండు పార్టీల వ్యవస్థ ఉందని, టిడిపి చేస్తున్న ప్రజావ్యతిరేక చర్యలను ప్రతిపక్షంలో ఉన్న వైసిపి ప్రశ్నించడం లేదని అన్నారు. 2013 భూ సంస్కరణల చట్టాన్ని మార్చినా జగన్ నోరెత్తలేదని అన్నారు. మైనారిటీలు, దళితుల వల్లే అధికారంలోకి వచ్చానని చెప్పుకుంటున్న వైసిపి దేశంలో వారిని ఊచకోత కోస్తుంటే చూస్తూ ఊరుకున్నారని అన్నారు. బిజెపి తీరుపై వైసిపి మౌనముద్ర నటిస్తోందని అన్నారు. బిజెపిపై పల్లెత్తు మాట కూడా అనడటం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో బిజెపిని ఓడించడం రాజకీయ ప్రత్యామ్నాయం ద్వారానే సాధ్యమని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, ఎం.ఏ.గఫూర్, వి.కృష్ణయ్య, ఎం.వి.ఎస్.శర్మ, సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, ఎం.కృష్ణమూర్తి, ఎం.సీతారాం, సున్నం రాజయ్య, డి.సుబ్బారావు, డి.రమాదేవి పాల్గన్నారు.